# నమస్తే తెలంగాణ
# కరీంనగర్

5 కరీంనగర్, గురువారం 19 డిసెంబర్ 2024 KARIMNAGAR


**పోలీసుల వేధింపులు?**

# చావుబతుకుల్లో యువకుడు



ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న రాజ్‌కుమార్

- పదిరోజులుగా వెంటిలేటర్‌పై కరీంనగర్‌లో చికిత్స
- పరిస్థితి విషమం.. హైదరాబాద్ తరలింపు
- కాంగ్రెస్ నాయకులు ఫోన్లు చేసి కొట్టించారంటున్న తల్లిదండ్రులు
- బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

పెద్దపల్లి, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఓ చిన్న గొడవ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. పోలీసుల వేధింపుల భయంతో ఆత్మహత్యకు యత్నించి, చావుబతుకుల మధ్య పోరాడాల్సి వస్తున్నది. అయితే కొందరు కాంగ్రెస్ నాయకులు కక్షతోనే తమ కొడుకును తీవ్రంగా కొట్టించారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బాధితుడి తల్లిదండ్రులు శీలం రాజేశ్వరి-దేవేందర్ కథనం ప్రకారం.. మంథని పట్టణంలోని శ్రీపాదకాలనీకి చెందిన యువకుడు శీలం రాజ్‌కుమార్ ఈ నెల 7న సాయంత్రం తన ఇంటి నుంచి మంథని డిపోవైపు వెళ్తున్నాడు. దారి మధ్యలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్న రాజేశ్ అనే యువకుడు రాజ్‌కుమార్‌ను పిలిచాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. అంతలోనే గుర్రాల బానయ్య సైతం వచ్చి రాజ్‌కుమార్‌ను కొట్టాడు. మిగతా హమాలీలు వచ్చి విడిపించారు. అక్కడితో ఆ గొడవ ముగిసింది. అయితే మరుసటి రోజు రాజేశ్ తన తోటి హమాలీలతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇచ్చాడు. దాంతో ఎస్ఐ రమేశ్ పోలీస్ వాహనంలో రాజ్‌కుమార్ వద్దకు వెళ్లి, వాహనంలో ఎక్కించుకొని స్టేషన్‌కు తీసుకొచ్చాడు. ఈ విషయాన్ని తెలిపేందుకు రాజ్‌కుమార్ మంచిర్యాల జిల్లాలో హోంగార్డుగా పనిచేస్తున్న తండ్రి దేవేందర్‌కు ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. తర్వాత అదే రోజు రాత్రి 8గంటలకు ముత్తారం మండలం ఓడేడ్‌లో ఉన్న తల్లికి ఫోన్ చేసి 'అమ్మా.. నన్ను పోలీసోళ్లు బాగా కొట్టారని చెప్పుకొంటూ' ఏడ్చాడు. దాంతో తల్లి తనకు మంథనిలో తెలిసిన రమేశ్‌కు ఫోన్ చేసి విషయం తెలుపడంతో స్టేషన్‌కు వెళ్లి రమేశ్‌ను తీసుకువచ్చాడు. తెల్లవారి మంథనికి వచ్చిన తల్లి, కొడుకు ఒంటిపై దెబ్బలను చూసి తల్లడిల్లింది. అప్పుడే ఇంటికి వచ్చిన తండ్రి దేవేందర్ కొడుకు ఒంటిపై దెబ్బలు చూసి తల్లడిల్లిపోయాడు. గాయాలను తన మొబైల్‌లో ఫొటోలు తీసి, ఎస్ఐ దగ్గరికి వెళ్లాడు. 'నా కొడుకును ఇంత దారుణంగా కొడుతారా'..? అని అడిగితే బెదిరించారని ఆరోపించాడు.

### రాజ్‌కుమార్ పరిస్థితి విషమం

పోలీసులు కొట్టడం, మరుసటి రోజు స్టేషన్‌కు రావాలని తరచూ ఫోన్లు చేయడం, మళ్లీ కొడతారనే భయంతో రాజ్‌కుమార్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా, కుటుంబ సభ్యులు కాపాడారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి, పదిరోజులపాటు చికిత్స అందించారు. అయితే వెంటిలేటర్‌పై శ్వాస తప్ప ఎలాంటి కదలికలు లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం మంగళవారం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. తన కొడుకుకు ఈ పరిస్థితిని తీసుకొచ్చిన కాంగ్రెస్ నాయకులు, ఎస్ఐ, సీఐలపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### నా కొడుకును కొట్టించిన్రు

అమ్మా నేను సచ్చిపోతనే, పోలీసోళ్లు మళ్లీ రమ్మంటున్నారే, పొద్దుగాల 10గంటల నుంచి ఎస్ఐ ఫోన్ చేసి రమ్మంటున్నాడే.. అని చెప్పుకొంట నా కొడుకు ఏడ్చిండు. 'నువ్ పురుషోత్తం రెడ్డి, పాపారావు, కొత్త శ్రీనివాస్, చిన్నను తిడుతున్నావంటరా.. వీళ్లందరినీ (కాంగ్రెస్ నాయకులను) ఎందుకు తిడుతున్నావురా.. వాళ్లు నిన్ను విడిచి పెట్టవద్దంటున్నరు అనుకుంట ఎస్ఐ వాళ్లతో ఫోన్ మాట్లాడుకుంటనే నన్ను కొట్టిండు' అని నా బిడ్డ చెప్పిండు. నా కొడుకు 'సత్తా సత్తా' అంటే పొద్దటి సంది నేను కావలి కాసిన. సాయంత్రం 5 గంటలకు మా అత్తను కావలి ఉంచి నేను స్నానానికి పోయిన. అంతల్నే మా అత్తను పక్కకు దొబ్బి, రూంలకు పోయి తలుపులు వెట్టుకొని ఉరేసుకున్నడు. మేం తలుపులు పలగొట్టి, కిందికి దించినం. దావఖన్ల చేర్పించినం. చెట్టసోంటి కొడుకు కదులుడు లేదు. మొదలుడు లేదు. అట్లనే ఉన్నడు. పది రోజులైతంది. పాయిదా లేక హైదరాబాద్ తీసుకొచ్చినం. మార్కెట్ కోసం నిరుడు నా కొడుకు లొల్లి పెట్టిండు. దాన్ని మనుసుల పెట్టుకొనే ఇదంత చేసిన్రు. కుట్ర పెట్టుకొనే కొట్టించారని నా కొడుకు నాకు జెప్పిండు. నా కొడుకు పరిస్థితికి కారణమైన వాళ్లను వదిలి పెట్టొద్దు. వాళ్లను కఠినంగా శిక్షించాలే.

**- బాధితుడి తల్లి శీలం రాజేశ్వరి**

### నా కొడుకును ఎట్లనైనా బతికించాలే

చిన్న గొడవైంది. ఆ గొడవకు సీఐకి ఎవరో ఫోన్ చేసిన్రని ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు కలిసి దారుణంగా కొట్టిన్రు. థర్డ్ డిగ్రీ ప్రయోగించిన్రు. మళ్లా రావాలని బెదిరించిన్రు. భయపడే నా కొడుకు ఉరేసుకున్నడు. నేను గొడవ జరిగినప్పుడు ఇంట్లో లేను. కొడుకు ఉరేసుకునేటప్పుడు ఇంట్లో లేను. కొత్త శ్రీను, పురుషోత్తంరెడ్డి, పాపారావు, చిన్న కలిసి నా కొడుకు మీద కేసు పెట్టిచ్చి కొట్టిచ్చిన్రు. నా కొడుకును ఎట్లానైనా బతికించాలే. కొన ఊపిరితో ఉన్నడు. రోజుకు రూ. 50వేలు అయితున్నయి. పరిస్థితి మంచిగా లేదంటే హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకొచ్చినం. మేమే బాధల ఉన్నమంటే మంథని సీఐ, ఎస్ఐలు ఫోన్లు చేసి మమ్ముల బెదిరిస్తున్నరు. ఏదేమైనా నాకొడుకును వాళ్లే బతికించాలే.



**- శీలం దేవేందర్, బాధితుడి తండ్రి**



**రేవంత్.. ఇచ్చిన హామీ నిలబెట్టుకో..**

కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట నినదిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

తమ సమస్యల పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 10 నుంచి జిల్లాకేంద్రాల్లో నిరవధికంగా దీక్షలు చేస్తున్నారు. బుధవారం తొమ్మిదో రోజుకు చేరగా, స్పందని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికల ముందు తమను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. **- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

# మళ్లీ పనిచేయని ధరణి పోర్టల్


- రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన భూ రిజిస్ట్రేషన్లు, స్లాట్స్ బుకింగ్
- ఇబ్బందిపడుతున్న రైతులు



మీ సేవ కేంద్రం వద్ద ధరణి స్లాట్ బుకింగ్ కోసం వేచి చూస్తున్న రైతులు

పెగడపల్లి, డిసెంబర్ 18: ధరణి పోర్టల్ మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా నిలిచింది. బుధవారం భూముల రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్‌ల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం ధరణి పోర్టల్ సవరణలో భాగంగా డిసెంబర్ 12 సాయంత్రం 5గంటల నుంచి 16వ తేదీ ఉదయం వరకు డాటా బేస్ అప్‌గ్రేడ్ ప్రక్రియను చేపట్టింది. తిరిగి ఈ నెల 16 నుంచి ధరణి సేవలు యథావిధిగా ప్రారంభం కాగా, ఈ నెల 16న ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1785 మంది రైతులు స్లాట్స్ బుక్ చేసుకున్నారు. అందులో 1402 మంది భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అలాగే 17న మంగళవారం 1917 మంది ధరణి పోర్టల్‌లో భూముల రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్స్ బుక్ చేసుకోగా, బుధవారం కేవలం 1141 మంది భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచే ధరణి పోర్టల్ పని చేయక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచి పోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు ధరణిలో భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ కోసం రైతులు మీ సేవ కేంద్రాలు, డాక్యుమెంట్ రైటర్ల దగ్గరికి వెళ్లగా.. ధరణి సైట్ పని చేయడం లేదని నిర్వాహకులు చెబుతుండడంతో చేసేదేం లేక నిరాశతో వెనుదిరిగారు.

# పత్తాలేని పట్టా పాస్‌బుక్!



- ఆరు నెలలుగా జాడలేని కొత్త పుస్తకాలు
- రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా జారీ కాని వైనం
- రైతుల ఎదురుచూపులు

కోనరావుపేట, డిసెంబర్ 18: వ్యవసాయ భూముల కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ నిలిచిపోయింది. నిత్యం వేలాదిగా ధరణి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా, పట్టాదారు పుస్తకాల జారీ ప్రక్రియ ఆరు నెలలుగా ఆగిపోయింది. గతంలో ధరణిలో భూమి రిజిస్ట్రేషన్ జరిగిన వారం పదిరోజుల్లో పట్టా బుక్కు పోస్టులో ఇంటికి వచ్చేది. అయితే కొన్నాళ్లుగా పాసు పుస్తకాల జారీ ఆగిపోయి, కొత్తగా భూములు కొన్న రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు అడిగితే రిజిస్ట్రేషన్ తర్వాత నేరుగా ఇంటికే పాసు పుస్తకాలు వస్తాయని చెబుతున్నా.. నెలలు గడిచినా రావడం లేదు. అసలు బుక్కులు వస్తయా.. రావా..? స్పష్టం చేయాలని రైతులు కోరుతున్నారు. ఒరిజినల్ పాస్‌బుక్‌లు ఉంటేనే బ్యాంకుల్లో రుణాలు ఇస్తామని బ్యాంకర్లు తేల్చి చెబుతుండడంతో ఏం చేయాలో తెలియక అవస్థలు పడుతున్నారు. అటు రెవెన్యూ, ఇటు తపాలా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### మూడు నెలల నుంచి ఎదురుచూస్తున్న



నేను కోనరావుపేట తహసీల్ ఆఫీస్‌లో మూడు నెలల కింద ధరణి ద్వారా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న. ఆఫీస్ నుంచి బయటకు వెళ్లకు ముందే మా తమ్ముడి పేరుమీదున్న భూమి నా పేరు మీద ఎక్కింది. నాకు పట్టా పాస్ బుక్ జిరాక్స్ ఇచ్చిన్రు. ఒరిజినల్ పాస్ బుక్ పోస్ట్‌లో ఇంటికి వస్తుందని అన్నరు. మూడు నెలలైతంది. ఇంకా రాలె. బుక్కు వస్తే బ్యాంకులో లోను తీసుకుందామని అనుకున్న. ఏం పాయిదా లేదు. ఇప్పటి వరకు చాలా సార్లు తహసీల్ ఆఫీస్‌కు వెళ్లి అడిగిన. పోస్టులోనే పాస్ బుక్ వస్తదని చెబుతున్నరు. అధికారులను అడిగితే పోస్టులో ఇంటికే వస్తదని అంటున్నరు. వాటి గురించి మరే సమాచారం తెలియదని చెబుతున్నరు. పాసు బుక్కు వస్తదో.. రాదో..? తెలియడం లేదు.

**- కాతుబండ చిన్న మల్లేశం, రైతు(మామిడిపల్లి)**




# ఆర్టీఏ కార్డుల 'పోస్ట్' బంద్!

- పోస్టల్‌శాఖకు బిల్లులు చెల్లించని ప్రభుత్వం!
- మూడు జిల్లాల్లో 3వేలకుపైగా కార్డులు ఆలస్యం
- వినియోగదారుల ఎదురుచూపు

**రవాణాశాఖకు సంబంధించిన కార్డులను పోస్టల్ శాఖ వినియోగదారులకు చేరవేస్తున్నది. అయితే ఆ శాఖకు కొన్ని నెలల బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్టీఏ పరిధిలోని సేవలకు బ్రేక్ పడింది. దీంతో లైసెన్స్, రిజిస్ట్రేషన్ కార్డులు రావడం లేదని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు వస్తాయో తెలియక ఆందోళన చెందుతున్నారు.**

తిమ్మాపూర్, డిసెంబర్18: ఉమ్మడి కరీంనగర్ రవాణాశాఖ సేవలను కరీంనగర్ పోస్టల్ శాఖ నిర్వహిస్తున్నది. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల ఆర్టీఏల్లోని కార్డులను కరీంనగర్ పోస్టల్‌శాఖ పంపుతుండగా, పెద్దపల్లితోపాటు హుజూరాబాద్‌కు సంబంధించి వరంగల్ పోస్టల్ శాఖ పంపిస్తున్నది. అయితే కరీంనగర్ పోస్టల్ పరిధిలో కొన్ని నెలలకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో కార్డుల పంపిణీకి బ్రేక్ పడింది. ఇలాంటి సమస్యే రాష్ట్రవ్యాప్తంగా రావడంతో ఇటీవల జాయింట్ కమిషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. జనవరిలో బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సేవలను పునరుద్ధరించారు. కానీ, కరీంనగర్ పోస్టల్ పరిధిలో మాత్రం పంపిణీ నిలిపివేశారు. 3 జిల్లాల్లో కనీసం మూడు వేల లైసెన్స్, రిజిస్ట్రేషన్ ఇతర కార్డులు నిలిచిపోగా, రవాణాశాఖపై వినియోగదారులు మండిపడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని వెంటనే కార్డులు పంపిణీ జరిగేలా చూడాలని కోరుతున్నారు.

### ఉన్నతాధికారులకు తెలిపాం

పోస్టల్‌శాఖకు సంబంధించిన బిల్లులు పెండింగ్ ఉన్నాయి. జనవరిలో చెల్లిస్తామని చెప్పాం. రాష్ట్ర వ్యాప్తంగా సేవలు కొనసాగుతున్నా.. కరీంనగర్‌లోనే ఈ పరిస్థితి ఉన్నది. బిల్లులు హైదరాబాద్ నుంచే విడుదల చేయాలి. పోస్టల్ అధికారులతో మాట్లాడినా వారు వినడం లేదు. బిల్లులు చెల్లిస్తేనే పోస్టు చేస్తమంటున్నారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలిపాం. **- పురుషోత్తం, డీటీసీ (ఉమ్మడి కరీంనగర్)**

## ఉచిత డ్రైవింగ్ శిక్షణకు ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 18: షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువత హెవీ మోటార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఎస్ నాగార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలపారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం టీజీ ఆర్టీసీ, ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో కొనసాగుతుందని చెప్పారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులై.. 35ఏండ్ల లోపు ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 35మంది చొప్పున బ్యాచ్‌లు ఏర్పాటు చేసి, 38రోజుల్లో శిక్షణ ఇచ్చిన తర్వాత లైసెన్స్ ఇస్తామని తెలిపారు. దరఖాస్తులను నగరంలోని సాయికృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

# విద్యార్థుల పొట్ట కొడుతరా..?



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

- మోడల్ స్కూళ్లలో వారం నుంచి భోజనం పెట్టరా..?
- పిల్లలు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకోవాలా..?
- మంత్రి ఇలాకాలో ఇంత జరుగుతున్నా పట్టించుకోరా..?
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- దర్యాపూర్ మోడల్ స్కూల్ పరిశీలన

ముత్తారం, డిసెంబర్ 18: 'కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైంది. రాష్ట్రంలోని సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం అందించలేని దుస్థితిలోకి వెళ్లిపోయింది. విద్యార్థుల పొట్ట కొడుతరా..? కడుపులు మాడుస్తరా..? ఇదేం ప్రభుత్వం' అని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. ముత్తారం మండలం దర్యాపూర్ మోడల్ స్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. అక్కడి పరిస్థితుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుట్ట మధూకర్ మాట్లాడారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో అనేక చోట్ల భోజనం నాణ్యత లేకుండా పోయిందని, దర్యాపూర్ మోడల్ స్కూల్లో ఏకంగా వారం రోజులుగా విద్యార్థులకు భోజనం అందించడం లేదని ఆరోపించారు. పిల్లలు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకునే దుస్థితి వచ్చిందన్నారు. అయినా వారం పాటు భోజనం పెట్టకున్నా అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిది నెలలుగా బిల్లులు రాకపోవడంతోనే నిర్వాహకులు భోజనం అందించడం లేదని తెలిపారు. మంత్రి ఇలాకలోని మోడల్ స్కూల్ పరిస్థితి ఈ విధంగా ఉన్నప్పటికీ కనీసం స్పందించే వారే లేరని చెప్పారు. మంథని నియోజక వర్గంలోని మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు భోజనాలు బంద్ అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, మంత్రిగా, మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్ బాబు విఫలం అయ్యారని విమర్శించారు. ప్రతిపక్షాలపై దాడులకు దిగడం, కేసులు పెట్టించడం ఆపి పరిపాలనపై, ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానల పనితీరుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజా సమస్యలు ఎక్కడున్నా స్పందిస్తామని, ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని స్పష్టం చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నాంసాని సమ్మయ్య, దర్యాపూర్ మాజీ సర్పంచ్ గాదం స్రవంతి శ్రీనివాస్, నాయకులు రామగళ్ల మధు, తిత్తుల శ్రీనివాస్, గిరి వీరేందర్, తాత బాలు ఉన్నారు.

# కార్యదర్శి ఒకరు.. సమాధానం మరొకరిది




నాగంపేట పంచాయతీ కార్యాలయం

- నాగంపేట జీపీలో ఇష్టారాజ్యం!
- విధుల్లో ఒకరు.. 'సమాచారం'లో సంతకాలు ఒకరివి
- సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి వచ్చిన వైనం
- నెలలు గడిచినా ఆర్టీఐ అర్జీదారుకి అందని సమాచారం

జమ్మికుంట, డిసెంబర్ 18: గ్రామస్థాయిలో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం జమ్మికుంట మండలంలో చర్చనీయాంశమైంది. పంచాయతీ నిధులపై ఆర్టీఐ ద్వారా ఓ అర్జీదారు అధికారులను సమాచారం కోరితే, గ్రామ పంచాయతీ విధుల్లో ఉండే కార్యదర్శి కాకుండా బదిలీ అయిన కార్యదర్శి సమాధానం ఇవ్వడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పడం విమర్శలకు తావిస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. జమ్మికుంట మండలం నాగంపేట పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాస్ గతంలో పనిచేశాడు. ఆయనపై అనేక ఆరోపణలు రాగా, జూలైలో బదిలీపై ఇల్లందకుంట మండలం సిరిసేడుకు వెళ్లాడు. సిరిసేడు కార్యదర్శి అంకూస్ నాగంపేటకు బదిలీపై వచ్చాడు. విధుల్లో చేరాడు. అయితే ఇదే సమయంలో నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి నాగంపేట జీపీకి వచ్చిన నిధులు, ఖర్చులు, తదితర అంశాలపై ఆర్టీఐ చట్టం ద్వారా కలెక్టర్‌కు అర్జీ పెట్టి సమాచారం కోరాడు. కొద్ది రోజుల తర్వాత సదరు అర్జీ మండల ఎంపీవోకు వచ్చింది. ఎంపీవో వెంకటేశ్వర్లు కార్యదర్శికి పంపించాడు. నెలలు గడిచినా ఆర్టీఐ అర్జీదారుకు సమాధానం రాలేదు. దాంతో నాగేశ్వర్‌రావు ఉన్నతాధికారులకు మరోసారి ఫిర్యాదు చేయగా, డీపీవో జోక్యం చేసుకొని సమాచారం ఇవ్వాలని అంకూస్‌ను ఆదేశించినట్లు తెలిసింది.

### తానే కార్యదర్శినంటూ..

జూలై నుంచి జీపీ కార్యదర్శిగా అంకూస్ విధులు నిర్వర్తిస్తున్నాడు. రిజిస్టర్‌లో సంతకాలు పెడుతున్నాడు. అయితే బదిలీపై వెళ్లిన శ్రీనివాస్ రంగంలో దిగాడు. తానే నాగంపేట కార్యదర్శినంటూ సిరిసేడు కార్యదర్శి శ్రీనివాస్ (గతంలో పనిచేసిన సెక్రటరీ)సెప్టెంబర్ 5న ఆర్టీఐ అర్జీదారు నాగేశ్వర్‌రావుకు జీపీ స్టాంపుతో ఓ లేఖ రాశాడు. 'మీరు సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు అడిగారు. మీకు జిరాక్సు పత్రాలు ఇవ్వాలంటే ₹10వేలకు పైగా చెల్లించాలి' అని అందులో పేర్కొన్నాడు. ఈ సమాధానానికి అర్జీదారు అవాక్కయ్యాడు. ఈ లేఖ కార్యదర్శి అంకూస్ ఇవ్వాల్సి ఉండగా, శ్రీనివాస్ ఇవ్వడమేంటని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అంతే కాకుండా అర్జీ పెట్టి నెలలకు గడిచినా సమాచారం ఇవ్వలేదని, సమాచార హక్కు చట్టం ప్రకారం గడువు దాటిన తర్వాత ఉచితంగా సమాచారం పత్రాలు ఇవ్వాలంటూ, దరఖాస్తుదారుడు రాష్ట్ర కమిషన్‌ను ఆశ్రయించాడు. ఇదిలా ఉండగా నాగంపేట కార్యదర్శి అంకూసా..? శ్రీనివాసా..? ఎవరు పనిచేస్తున్నారు? అధికారులు సపోర్టు ఎంత? అనేక సందేహాలున్నాయి.

### పొంతన లేని సమాధానాలు

పంచాయతీ కార్యదర్శి ఎవరు? తప్పుడు సమాధానాలు.. తదితర అంశాలపై అధికారులను 'నమస్తే' వివరణ కోరింది. అయితే 'కార్యదర్శిని నేనే. అర్జీ వచ్చింది. రికార్డులు నాకు పాత కార్యదర్శి అప్పగించలే. ఆర్టీఐ సమాధానం మాత్రం శ్రీనివాస్ ఇచ్చాడు' అంటూ తడబడుకుంటూ అంకూస్ సమాధానం చెప్పాడు. ఇక ఇదే విషయాన్ని ఎంపీడీవో భీమేశ్, ఎంపీవో వెంకటేశ్వర్లును అడిగితే.. అలా ఒక కార్యదర్శికి బదులు మరో కార్యదర్శి సమాధానం ఇవ్వడం తప్పేనని, పూర్తి వివరాలు తెలుసుకుంటామని చెప్పుకొచ్చారు.




వేములవాడ ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

# కోడెల తరలింపుపై స్పష్టత ఇవ్వాలి

- కాంగ్రెస్ నేతలవి డైవర్ట్ రాజకీయాలు
- వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదు
- వేములవాడలో బీఆర్ఎస్ నేతల ప్రెస్‌మీట్

వేములవాడ, డిసెంబర్ 18: రాజన్న ఆలయ గోశాలలోని కోడెలను కబేళాలకు తరలించిన ఘటనపై విప్ ఆది శ్రీనివాస్ భక్తులకు స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కోడెల తరలింపుపై తమ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని అడిగితే కాంగ్రెస్ నేతలు డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం వేములవాడ పట్టణంలోని ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేత వెంగళ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ సిఫారసు లేఖతో కోడెలను కబేళాలకు తరలించారని పోలీసుల నిర్ధారించి కేసులు నమోదు చేసినా.. కాంగ్రెస్ నాయకులు మాత్రం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుపై మరోసారి వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి కోడెల మృతిపై శాంతి హోమం నిర్వహిస్తే.. కనీస పరిజ్ఞానం లేకుండా కాంగ్రెస్ నేతలు మాట్లాడడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కోడెల తరలింపులపై అధికారులను కలెక్టర్ మందలించినా కాంగ్రెస్ నేతలకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వేములవాడలో రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఒక్కో భోజనం ప్లేట్ ఖర్చు రూ.32వేల పెట్టి భక్తుల మనోభావాలను కించపర్చారన్నారు. మీరు చేసిన పాపాలు పోవాలంటే.. రాజన్న ఆలయ ధర్మగుండంలో మునిగి.. తడిబట్టలతో పొర్లుదండాలు పెట్టి మమ్మల్ని క్షమించు రాజన్నా.. అని వేడుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. సమావేశంలో సీనియర్ నాయకులు పోతు అనిల్, లిక్కిడి మహేందర్, వాసాల శ్రీనివాస్, సుంకపాక రాజు, ఎస్కే ఫర్వేజ్, మంతే సందీప్, దురిశెట్టి ప్రేమ్‌చారి, బూర రాజశేఖర్, ఎండి రఫిక్, వెంకటసాయి, తీగల హరీశ్, చీటి సంధ్యారాణి, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

# స్టే ముగిసిన 24 గంటలకే కూల్చివేతలు

- గోదావరిఖని లక్ష్మీనగర్‌లో మొబైల్ దుకాణాలు నేలమట్టం
- మరో చోటుకు తరలిస్తామని చెప్పి మాట మార్చిన అధికారులు
- బాధితులు లబోదిబో

కోల్‌సిటీ, డిసెంబర్ 18: కోర్టు స్టే గడువు అటు ముగిసిందో లేదో.. ఇటు రామగుండం నగరపాలక అధికారులు కూల్చివేతలకు దిగారు. గోదావరిఖని ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో దాదాపు 16 మొబైల్ దుకాణాలను బుధవారం మధ్యాహ్నం పోలీస్ బందోబస్తు మధ్య నేలమట్టం చేశారు. అప్పటికే దుకాణాల వ్యాపారులు ఖాళీ చేస్తామని చెబుతున్నప్పటికీ మరోపక్క ఎక్స్‌కవేటర్‌తో కూల్చేశారు. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీనగర్ దగ్గరలో సింగరేణి క్వార్టర్లు ఉన్నాయి. ఈ క్రమంలో కార్మికుల అవసరాల దృష్ట్యా ఈ షాపులున్న ప్రాంతాన్ని గతంలోనే ప్రభుత్వం నుంచి సింగరేణి లీజుకు తీసుకున్నది. కార్మికుల వినోదం కోసం థియేటర్, వ్యాపార అభివృద్ధికి అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో చాలా దుకాణాలు ఏర్పాటయ్యాయి. అయితే థియేటర్ లీజు గడువు ముగియడంతో చాలా ఏండ్ల క్రితమే మూతపడింది. అయితే ఇటీవల సింగరేణి లీజు గడువు ముగియడంతో ఆ స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించింది. అయితే ఆ స్థలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించుకోవాలని చూసిన అధికారులు, కొద్దిరోజుల క్రితం లక్ష్మీనగర్‌లోని మూతపడిన ఓల్డ్ అశోక్ థియేటర్‌ను కూల్చివేశారు. ఇక్కడి మొబైల్ దుకాణాలను కూడా తొలగిస్తామని హెచ్చరించారు. అయితే వ్యాపారులు కోర్టు నుంచి స్టే తీసుకురావడంతో కూల్చివేత చర్యలను విరమించుకున్నారు. మంగళవారం నాటికి కోర్టు స్టే గడువు ముగియడంతో బుధవారం మధ్యాహ్నం రంగంలోకి దిగి ఒక్కొక్కటిగా నేలమట్టం చేశారు. అయితే ఇక్కడ దుకాణాలను తొలగిస్తే దగ్గరలో నిరుపయోగంగా ఉన్న రామగుండం కార్పొరేషన్ వ్యాపార సముదాయం (షాపింగ్ కాంప్లెక్స్)లో గదులు కేటాయిస్తామని చెప్పిన అధికారులు, ఇప్పుడు అదీ కుదరదంటూ చేతులెత్తేశారు. దీంతో వ్యాపారులంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు తరలిస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.